బీజేపీలో పలువురి చేరిక



ఎంపీ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి రఘునందన్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్ల సతీష్, ఆకాష్, సంపత్, విక్రమ్, వంశీ, శివశంకర్, ఓంకార్, సత్యనారాయణ వరుణ్, హరిప్రసాద్, కృష్ణంరాజు, చంద్రశేఖర్ ఉన్నారు.

వర్షపునీరు వెళ్లేలా ఏర్పాట్లు

మోతీనగర్: అధికారులతో మాట్లాడి వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. గాయత్రీనగర్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్వత్ నగర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ముందు నుంచి గాయత్రీనగర్ హరిహర టెంపుల్ వైపు వెళ్లే రహదారి మొత్తం వర్షపు నీరు, మంచినీటి సరఫరా వచ్చినప్పుడల్లా రోడ్లు జలమయంగా మారుతున్నాయని కాలనీవాసులు తెలిపినట్లు పేర్కొన్నారు. సంజీవరెడ్డి, సంజీవ, జాహిద్ షరీఫ్ బాబా, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విల్లు సంధించి.. టార్గెట్ సాధించి

విల్లు పట్టి వలయాన్ని గురి చూసి కొట్టారు.. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే చాన్స్ పట్టారు. రాష్ట్రస్థాయి వేదికపై ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆ పతకాలు సాధించడం వెనుక కృషి, పట్టుదలతో పాటు కఠోర సాధన ఎంతో ఉందని చెప్పక తప్పదు. మరోమారు జాతీయ వేదికపై సత్తా చాటేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనెల 15 నుంచి జార్ఖండ్ రాష్ట్రంలో పోటీలు జరగనున్నాయి.

- జాతీయ స్థాయి ఆర్చరీకి క్రీడాకారుల ఎంపిక
- కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పోటీల నిర్వహణ



ఆర్చరీ పోటీల్లో నెగ్గిన క్రీడాకారులు

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 1న నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల విజేతలను ప్రకటించారు. ఎంపికైన వారు ఈ నెల 15 నుంచి 20 వరకు జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొంటారని ఆర్చరీ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టీఎస్ పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆదివారం 10వ రాష్ట్ర ఆర్చరీ చాంపియన్ షిప్, రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కోశాధికారి సత్య ప్రసాద్, భీమ్ సేన్, ప్రణయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వసంత విచ్చేసి ప్రతిభ చూపిన ఆర్చర్స్‌ను అభినందించారు. కాగా, నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన పవన్ కళ్యాణ్‌ను సన్మానించారు.

విజేతలు వీరే

ఇండియన్‌రౌండ్ పురుషుల విభాగంలో..

తెలంగాణ స్థాయి ఆర్చరీ పోటీల్లో ఇండియన్ రౌండ్ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన రమావత్ రవి ప్రథమ స్థానం. ఖమ్మంకు చెందిన కాయం లక్ష్మణ్. వరంగల్ క్రీడాకారుడు సీహెచ్.చరణ్, ఖమ్మంకు చెందిన ముత్తి చరణ్ వరసగా 2, 3, 4వ స్థానాలు పొందారు.

ఇండియన్ రౌండ్ మహిళా విభాగంలో..

వరంగల్‌కు చెందిన క్రీడాకారిణులు రఫీఖ్ తాసీమ్ ప్రథమ, వరంగల్ క్రీడాకారిణి బి.త్రినయిని ద్వితీయ, వి. స్రవంతి(రంగారెడ్డి జిల్లా) తృతీయ, నిజామాబాద్‌కు చెందిన భవానీ నాల్గో స్థానం.

రికర్వ్ ఆర్చరీ పురుషుల విభాగంలో..

గంగరాజు(వరంగల్), ఎన్. అశోక్ (రంగారెడ్డి), ఎస్. అఖిల (వరంగల్)లు వరుసగా తొలి మూడు స్థానాలు. అలాగే వరంగల్ చెందిన కె. అచ్యుత్ నాల్గవ స్థానం.

రికర్వ్ మహిళా విభాగంలో..

ఎస్.నాగేశ్వరీ (వరంగల్), శారద(వరంగల్), గుర్రాల వింధ్యా(రంగారెడ్డి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు. వరంగల్‌కు చెందిన క్రీడాకారిణి విజయ లక్ష్మీ నాల్గవ స్థానం.

కంపౌండ్ పురుషుల విభాగంలో..

ఖమ్మం క్రీడాకారుడు వేముల శివసాయి ప్రథమ స్థానం. ద్వితీయ, తృతీయ స్థానాల్లో హైదరాబాద్‌కు చెందిన కే.సాయి సుశాంత్, ఐసయ్య రాజేందర్. ఆర్యన్ నాల్గవ స్థానం.

కంపౌండ్ మహిళ విభాగంలో..

టి.చికిత(కరీంనగర్), బి.మానస నయన(రంగారెడ్డి), మన్సూరా హసీబా(వరంగల్)లు వరుసగా మొదటి మూడు స్థానాలు. హైదరాబాద్‌కు చెందిన శ్రేష్ట రెడ్డి నాల్గవ స్థానం.

హిమాచల్ పర్యటనకు 50 మంది విద్యార్థుల ఎంపిక

రాయదుర్గం: 'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' యువ సంఘం ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్ పర్యటనకు 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు నోడల్ అధికారి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 29 వరకు వీరు హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లోని ఎన్ఐటీని సందర్శిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'ఏక్‌భారత్ శ్రేష్ట భారత్' కార్యక్రమాలను నిర్వహించేందుకు మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం నోడల్ విశ్వవిద్యాలయంగా నామినేట్ అయిందని తెలిపారు. అంతేగాకుండా అక్కడి ఎన్ఐటీతో విద్యా మంత్రిత్వ శాఖ 'మనూ'ను జత చేసిందని పేర్కొన్నారు.

బచ్‌పన్ ప్లే స్కూల్‌లో స్పోర్ట్స్ డే



శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో స్పోర్ట్స్ డే వేడుకలను స్కూల్ డైరెక్టర్ పాక సారథ్, అడిషనల్ డైరెక్టర్ కోయిలకొండ శేషారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆట పాటలతో చిన్నారులు ఉత్సాహంగా ఉంటారన్నారు. క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం అన్ని విషయాలను ప్రాథమిక స్థాయి నుంచే వారిలో పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీవాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు త్రివేణి పాఠశాల విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థులతో డైరెక్టర్ వీరేంద్ర చౌదరి తదితరులు

చందానగర్: రంగారెడ్డి జిల్లాస్థాయిలో ఇటీవల వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలతో పాటు మదీనాగూడ, లింగంపల్లి త్రివేణి పాఠశాల విద్యార్థులు 12 ప్రాజెక్టులతో పాల్గొన్నారు. ఇందులో మదీనాగూడ బ్రాంచ్‌కి చెందిన సీనియర్ విభాగంలో పాల్గొన్న కే మానస్విని, ఎ.లక్ష్మీసప్రాస, అనివ్రత, హాసిని, స్నేహిత రెడ్డి, సజిత, గోపాల్ చౌదరి, అనన్య ప్రార్థన్ మొదటి బహుమతి పొందగా, జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతులు పొందారు. గెలుపొందిన విద్యార్థులను త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో త్రివేణి స్కూల్స్, సీఆర్ఓ సాయి నర్సింహారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, జగదీశ్ బాబు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి

రాయదుర్గం: జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు, పూలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఆలయంలోని షిర్డీసాయిబాబా, రాజరాజేశ్వరి మాత, గణపతి, ఆంజేయస్వామి, పెద్దమ్మ, మైసమ్మ అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సోఫా తయారీ దుకాణంలో అగ్ని ప్రమాదం



చందానగర్: సోఫా తయారీ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మియాపూర్ మదీనాగూడకు చెందిన జగదీశ్ పాటిల్‌కు శేరిలింగంపల్లి గుల్మోహర్ పార్కు సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద మహవీర్ సోఫా తయారీ దుకాణం ఉంది. గత నెల 30న రాత్రి 8 గంటలకు షాప్ మూసేసి వెళ్లాడు. ఆదివారం దుకాణం బంద్ ఉన్నది. అర్ధరాత్రి షాపు నుంచి మంటలు వస్తున్నాయని పెట్రోల్ పంప్ నుంచి పాటిల్‌కు ఫోన్ చేశారు. వెంటనే షాప్ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే షాప్‌లోని ఫర్నీచర్, యంత్ర పరికరాలు, కిటికీలు కాలి బూడిదయ్యాయి. సోమవారం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షాప్ వెనకాల చెత్తాచెదారం కుప్పలుగా వేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు అగ్ని ప్రమాదం చేసి ఉంటారని పోలీసుల దృష్టికి బాధితుడు తీసుకెళ్లాడు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంబీసీ చైర్మన్ జైపాల్ తదితరులు

మియాపూర్: మియాపూర్ మక్తమహబూబ్‌పేట ప్రభుత్వ పాఠశాలను ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ సోమవారం తనిఖీ చేశారు. సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్షయ పాత్ర ద్వారా అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారని మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కవిరాజ్, చంద్రయ్య, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై పటిష్ట చర్యలు

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందిస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ వెల్లడించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులకు అందజేసి స్వయంగా ఫీల్డ్ వర్క్ నిర్వహించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, రాజేంద్రనగర్ డివిజన్ ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

పాపమ్మ కాలనీ అభివృద్ధికి కృషి



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: పాపమ్మ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖద్వారాన్ని సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావ్వాలన్నారు. కాలనీలను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాపమ్మ, రాంచందర్, వేలు, రాము, కృష్ణ, త్రినాథ్, వెంకటరావు, మాధవరావు, శ్రీను, కుమార్, నరేందర్, నందు, రామరాజు, జీవన్, రామకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: ఎయిడ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో హెచ్ఐవీ ప్రజా ఆరోగ్య సమస్యగా మిగిలిపోయిందని, హెచ్ఐవీకి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. హెచ్ఐవీ మానవ శరీరంలోని తెల్లరక్త కణాలను లక్ష్యంగా చేసుకుని రోగ నిరోధక శక్తిని బలహీన పరుస్తుందన్నారు. హెచ్ఐవీకి యాంటీ రెట్రో వైరల్ ఔషధాలతో చికిత్స చేయనున్నారు. ఈ థెరపీ ద్వారా హెచ్ఐవీ సంక్రమణ నయం కాదు.. వ్యక్తి యొక్క రోగ నిరోధక వ్యవస్థను మాత్రమే బలోపేతం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నోముల యోగిబాబు, డాక్టర్ విజయలక్ష్మి, షరీఫ్‌మియా, బోధనేతర సిబ్బంది అరుణ్, 100 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బొల్లారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని డిజైర్ సొసైటీలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ డేను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంగాభవానీ ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. బాధితులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వారి హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహారంపై సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు నిర్మల, సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న విజయ్‌కుమార్

చందానగర్: హఫీజ్‌పేట్‌కు చెందిన కృష్ణ అనే దివ్యాంగుడికి లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ అండగా నిలిచింది. చందానగర్‌లోని క్లబ్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ దివ్యాంగుడి వైద్య చికిత్స కోసం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి శాంతి భూషణ్ రెడ్డి, బర్కా మల్లేశ్ యాదవ్, మారం ప్రసాద్, సింగదాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాస పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు సోమవారం ఘనంగా ముగిశాయి. నెల రోజుల నుంచి శివ నామ స్మరణతో ఆలయ ప్రాంతాలు మారుమ్రోగాయి. ప్రతి రోజు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

10న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: పాపారాయుడు నగర్, ఆస్బెస్టాస్ కాలనీ చివరి బస్టాండ్ వద్ద అశోక గార్డెన్స్‌లో శేరిలింగంపల్లి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 10న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ క్రిస్మస్ వేడుకల్లో వర్తమానికులు రెవ. సుధాకర్ ప్రసంగించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని ఎస్‌వీఎస్ కళానికేతన్ కూచిపూడి నృత్య ప్రదర్శన శాల ఆధ్వర్యంలో షిరిడీ సాయి మందిరంలో ఆదివారం రాత్రి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా నృత్య ప్రదర్శన జరిగింది. షిరిడీ సాయి మందిరం కమిటీ సభ్యులు కూచిపూడి నృత్య గురువు దీపను, విద్యార్థులను సత్కరించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బండ్లగూడ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమాజ సేవలో భాగంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం గవర్నమెంట్ ఫీవర్ ఆస్పత్రి నుంచి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రింకీ మినిస్ట్రీ సొసైటీ సౌజన్యంతో ఆస్పత్రిలో విద్యార్థులు రక్త దానం చేశారు. అనంతరం ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం కోసం ఆస్తులు అమ్మి చదివించేవారు ఉన్నారని వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. చెడు వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. ఆస్పత్రి ఆర్ఎంవో జయలక్ష్మి, సొసైటీ ఫౌండర్ బాల్‌రాజ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వీరేంద్ర పాటిల్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 16 మందికి ఒక్కొక్కరికీ రూ. 2 వేల జరిమానా, ముగ్గురికి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అనాథలకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ

మోతీనగర్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతోనే జీవితానికి సార్థకత లభిస్తుందని శ్రీశృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి అన్నారు. ఆదివారం రాత్రి సువర్ణభూమి మహోత్సవ, సేవా భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్డుపై నివసిస్తున్న వయో వృద్ధులకు, అనాథ ఆశ్రమంలోని వృద్ధులు, చిన్నారులకు, ఓం సాయి వృద్ధుల ఆశ్రమంలో, పేద బాలికల ఆశ్రమంలో దుప్పట్లను అందజేశారు. సుమారు 400 మందికి దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో కూడా పలు సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసిన ఘటన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలంలోని వాణీనగర్‌కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి షేక్ మరవాలి, సహదేవ రాజు, రవీందర్, దుర్గారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, 7.74 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అమీన్‌పూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

నేడు వాహనాల వేలం

గంజాయి కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పటాన్ చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనాలని కోరారు.

4న 'టీ హబ్'కు పీవీ సింధు రాక

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌కు ఈనెల 4న ఒలింపిక్ విజేత, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు రానున్నారు. సాయంత్రం 5.30 గంటలకు టీహబ్ ఫౌండేషన్ (ది మార్వెల్)లో అబిరో క్యాపిటల్ ఫండ్ లాంచింగ్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అబిరో క్యాపిటల్ అనేది యూఎస్, హైదరాబాద్ ఆధారితమైన ప్రారంభ దశ టెక్ ఫోకస్డ్ వీసీ ఫండ్. కాగా పర్యావరణ వ్యవస్థకు మరింత చేయూతనందించేందుకు అబిరో క్యాపిటల్‌తో టీహబ్ భాగస్వామి కావడం గర్వంగా ఉందని టీహబ్ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొననున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

కూకట్‌పల్లి: హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష పుష్పార్చనను దేదీప్యమానంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాల ధారణ స్వాములు నగరంలోని నలుమూలల నుంచి హాజరై అయ్యప్ప సంకీర్తన, పూజలతో హోరెత్తించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, గురుస్వామి వడ్డేపల్లి రాజేశ్వరరావు, అరుణ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన

కూకట్‌పల్లి: ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా కేపీహెచ్‌బీకాలనీ రెండో రోడ్డులోని షిరిడీ సాయిబాబా ఆలయంలో అయ్యప్ప స్వాములకు సోమవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి, మమత, మంథస్ రాజీవ్ రెడ్డి, భువస్ రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్

మూసాపేట: గంజాయి విక్రేతను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీ జయనగర్‌కు చెందిన కోసూరి తులసి రామరాజు (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బీటెక్ నుంచే గంజాయి తాగే అలవాటు ఉంది. 18 నెలల నుంచి నానక్‌రాంగూడ నుంచి తీసుకువచ్చి తాగుతూ,విక్రయిస్తుండేవాడు. అరకులోని తనకు తెలిసిన సుభాష్ నుంచి కిలో 400 గ్రాముల గంజాయి ఈ నెల 30 న తీసుకువచ్చి 1వ తేదీ రాత్రి జయనగర్‌లోని విల్‌సన్ క్రికెట్ అకాడమీ వద్ద అమ్ముతుండగా పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

క్రషర్ ఏర్పాటును నిలిపివేయాలని ధర్నా



మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్తూరు గ్రామంలో క్రషర్ల ఏర్పాటును గ్రామస్తులు అడ్డుకుని హిటాచీ వాహనాన్ని గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై గ్రామస్తులు ఆదివారం గ్రామసభ నిర్వహించి తీర్మానం ఆమోదించారు. ఈ మేరకు క్రషర్ ఏర్పాటు పనులపై గ్రామస్తులంతా కలిసి మండల కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. క్రషర్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తహసీల్, సీఐ కార్యాలయాల్లో వినతిపత్రాన్ని అందజేశారు. నల్తూరు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రహరీ పనులను అడ్డుకున్న దళితులు



మణికొండ: అనాదిగా దళితులు సాగు చేసుకుంటున్న భూమిని హౌసింగ్ బోర్డుకు కేటాయించారని ప్రహరీ పనులను చేపట్టేందుకు వచ్చిన అధికారులను వారు అడ్డుకున్నారు. గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 132లోని 56 ఎకరాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హౌసింగ్ బోర్డుకు కేటాయించింది. దశాబ్ద కాలానికి పైగా అందులో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. అందులో అనాదిగా గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల హౌసింగ్ బోర్డు అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో అందులో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. సోమవారం సదరు భూమి చుట్టూ ప్రహరీ పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న దళితులు అక్కడకు చేరుకుని తమ భూమిని ఎట్టి పరిస్థితిలో తీసుకోనివ్వమని పనులను అడ్డుకున్నారు. దాంతో చేసేది లేక అధికారులు పనులు నిలిపివేశారు.

రైతులకు అండగా ఉంటాం: ప్రదీప్‌కుమార్

వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన దళితుల భూమిని హౌసింగ్ బోర్డు వారు తీసుకోవడం మంచి పద్ధతి కాదని, తామంతా వారికి అండగా ఉంటామని నార్సింగి మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైలారం ప్రదీప్‌కుమార్ అన్నారు. ఈ విషయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.